గాజా ప్రజల క్షేమం కోసం హైదరాబాద్ సైదాబాద్‌లోని హజ్రత్ ఉజాలేషా ఈద్గాలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మహిళలు.

# ఐరాస జోక్యం చేసుకోవాలి

## పశ్చిమాసియాలో వేలమంది మృతిపై కేటీఆర్ ఆందోళన

## గాజాలో తక్షణ కాల్పుల విరమణ పిలుపునకు మద్దతు

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధంలో వేల మంది పౌరులు మృత్యువాత పడటం పట్ల బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం మానవతా సంక్షోభాన్ని సృష్టిస్తున్నదని ట్విట్టర్ వేదికగా ఆవేదన చెందారు. గాజాలోని ఒక దవాఖానపై జరిగిన బాంబు దాడిలో అమాయకులైన వందల మంది పౌరులు దుర్మరణం చెందడం అత్యంత బాధాకరం అని తెలిపారు. గత రెండు వారాలుగా కొనసాగుతున్న ఘర్షణల కారణంగా 4,500 మందికి పైగా మరణించటం హృదయవిదారకం అని పేర్కొన్నారు. తక్షణమే కాల్పులు విరమించాలన్న పిలుపునకు తాను కూడా మద్దతునిస్తున్నానని కేటీఆర్ తెలిపారు. గాజా ప్రజలకు వెంటనే మానవతా సాయాన్ని అందజేయాలని అన్నారు. ఈ అవాంఛిత యుద్ధంలో భాగస్వాములైన అన్ని పక్షాలు విచక్షణారహిత హింస నుంచి వైదొలగాలని పిలుపునిచ్చారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకొనేందుకు ప్రయత్నించాలని సూచించారు. అటు పాలస్తీనా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని, అలాగే తమ పౌరుల భద్రతపై ఇజ్రాయెల్ ఆందోళనను కూడా పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ హైకోర్టు డిజిటలైజేషన్ వింగ్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ తదితరులు

# హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ

- వచ్చే ఏడాదీ పోటీలు మన దగ్గరే
- పదో సీజన్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం
- స్పష్టత ఇచ్చిన రేసింగ్ నిర్వాహకులు

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ఫార్ములా-ఈ రేసింగ్‌కు విశ్వనగరం హైదరాబాద్ మరోమారు ఆతిథ్యమివ్వబోతున్నది. దేశంలో తొలిసారి పోటీలకు వేదికైన హైదరాబాద్‌లో మళ్లీ వచ్చే ఏడాది ఫార్ములా-ఈ కార్లు రయ్‌రయ్‌మంటూ అభిమానులను అలరించబోతున్నాయి. గత కొన్ని రోజులుగా హైదరాబాద్ ఆతిథ్యంపై వస్తున్న నిరాధార వార్తలకు ఎట్టకేలకు పుల్‌స్టాప్ పడింది. వచ్చే ఏడాది కూడా హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ పోటీలు జరుగుతాయని నిర్వహకులు గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన హైదరాబాద్ వేదికగా ఫార్ములా-ఈ 10వ ఏబీబీ ఎఫ్ఐఏ సీజన్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. గురువారం సమావేశమైన ఎఫ్ఐఏ వరల్డ్ మోటార్ స్పోర్ట్ కౌన్సిల్..ఫార్ములా-ఈ 2024 వేదికలకు ఆమోద ముద్ర వేసింది. దీంతో మరోమారు రేసింగ్ అభిమానులు రాష్ట్ర రాజధానిలో రయ్‌రయ్‌మంటూ వెళ్లే కార్ల వేగాన్ని ఆస్వాదించే అవకాశం లభించింది. ఇదిలా ఉంటే ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఫార్ములా-ఈ రేసును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. దేశంలో తొలిసారి జరిగిన ఈ పోటీలకు ఆతిథ్య హక్కులు దక్కే విషయంలో మంత్రి కేటీఆర్ అన్నీతానై వ్యవహరించారు. నిత్యం ఫార్ములా-ఈ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతూ హైదరాబాద్ వేదికగా జరగడంలో కీలక భూమిక పోషించారు. ఈ క్రమంలో ఫార్ములా-ఈ నిర్వాహకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రిస్తూ ఎలక్ట్రిక్ కార్లతో రూపుదిద్దుకున్న ఫార్ములా-ఈ రేసింగ్‌కు ప్రపంచ వ్యాప్తంగా విపరీతమైన ఆదరణ లభిస్తున్నది.

# కర్ణాటకలో కటిక చీకట్లు!

మొదటిపేజీ తరువాయి...

సరఫరాల లేక చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయని కన్నడిగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు కోతలతో బెంగళూరులో ఐటీ కంపెనీలు సతమతమవుతున్నాయని, వివిధ రకాల పరిశ్రమలు పరిశ్రమలు సిబ్బందిని తొలగిస్తున్నాయని చెప్తున్నారు.

### రాష్ట్ర చరిత్రలోనే లోటు విద్యుత్తు

కర్ణాటక రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో అనధికార కోతలు ఆరేడు గంటలపాటు ఉన్నాయి. అక్టోబర్‌లో ఉష్ణోగ్రతలు పెరగడంతో 1,500 మెగావాట్ల నుంచి 2,000 మెగావాట్ల వరకు లోటు విద్యుత్తుతో సతమతం అవుతున్నదని, కర్ణాటక రాష్ట్ర చరిత్రలోనే రికార్డుస్థాయిలో విద్యుత్తు లోటు నమోదైందని విద్యుత్తు అధికారులు సైతం తెలిపారు. అయితే పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో 24 గంటలపాటు కరెంటు బుగ్గలు వెలుగుతుంటే తమ రాష్ట్రంలో నాలుగు గంటలు కూడా గగనమైతున్నదని కన్నడ ప్రజలు, రైతులు వాపోతున్నారు. కోతలు లేకుండా, తమకు నాణ్యమైన విద్యుత్తు అందించాలంటూ చాలాచోట్ల రైతులు ఆందోళనలు చేస్తున్నారు.

కరెంటు కోతలను నిరసిస్తూ ఇటీవల కర్ణాటకలోని మాండ్యలో సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

### ఎడాపెడా కరెంటు కోతలు

కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అన్నదాతలకు కష్టాలు అధికమయ్యాయి. వ్యవసాయానికి సరిపడా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తామని అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ.. ఆ హామీని నిలబెట్టుకోవడంలో ఘోరంగా విఫలమైంది. గంటలకొద్దీ ఎడాపెడా కోతలు విధిస్తున్నది. ఫలితంగా వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఇది తట్టుకోలేని రైతులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. గడిచిన 18 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 1,219 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. కోతలు లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

- లక్ష్మారెడ్డి, హన్‌పూర్ గ్రామం, మాజీ జడ్పీవైస్‌చైర్మన్ గుల్బర్గ

### పొలం ఎండిపోతున్నది..

నాలుగెకరాల్లో వరి వేసిన. కాంగ్రెస్ నాయకులు 7 గంటల కరెంటు ఇస్తమన్నరు. ఇప్పుడు 5 గంటలు కూడా ఇస్తలేరు. అదికూడా సక్కగ ఇస్తలేరు. అన్ని కోతలు. 2 ఎకరాలు పారుతుంది, 2 ఎకరాలు ఎండుతుంది. 5 నెలల్లోనే కాంగ్రెస్ చుక్కలు చూపిస్తున్నది. 4 ఎకరాల సాగు కోసం 2 లక్షల అప్పు చేసినం. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ నేతలు దోచుకోవడం, దాచుకోవడంపైనే దృష్టి పెట్టారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఉన్నాయి. ఎవుసం చేయలేని పరిస్థితి దాపురించింది.

- లక్ష్మీకాంత్‌రెడ్డి, హన్‌పూర్ గ్రామం

### పాతవి తీసేశారు.. కొత్తవి అమలు చేస్తలేరు..

కర్ణాటకలో ప్రతి పేదవాడికి 200 యూనిట్ల విద్యుత్తు ఉచితంగా ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇచ్చింది. ఉచిత విద్యుత్తు దేవుడెరుగు, అసలు కరెంటుకే దిక్కు లేకుండా పోయింది. పాత స్కీములు ఆపిస్రు. కొత్తవి అమలు చేస్తలేరు. 7 గంటల కరెంటు ఇస్తమన్నరు.. 5 గంటలు కూడా కోతలు లేకుండా ఇస్తలేరు. పొద్దున సగం, రాత్రి సగం ఇస్తున్నరు. ప్రజల విద్యుత్తు అవసరాలు తీర్చడంలో కర్ణాటక ప్రభుత్వం చేతులెత్తేసింది.

- రాజు, మస్లే గ్రామం, కర్ణాటక

### పొద్దున 2 గంటలు.. రాత్రి 3 గంటలు

కర్ణాటకల రైతుల పరిస్థితి చాలా ఘోరంగా ఉన్నది. ఇంతకుముందు బీజేపీ ప్రభుత్వం ఏడు గంటలపాటు కరెంటు ఇడుస్తుండె. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఐదు గంటలే ఇడుస్తున్నరు. అది కూడా పొద్దున రెండు గంటలు. రాత్రి 3 గంటలు ఇస్తున్నరు. అదేమైనా సక్కగ ఇస్తర అంటే లేదు. లోడు పడుతున్నదని చెప్పి కోతలు పెట్టుకుంట ఇస్తున్నరు. మోటర్లు కాలుతున్నయ్. ఐదు గంటలు ఇచ్చినా ఎకరం కూడా పారుతలేదు. పంటలు ఎడిపోతున్నయ్.

- ముకరాన, మలబార్ గ్రామం

## లోకం పోకడ




కరెంటు స్తంభాలను పట్టుకుంటే డేంజర్ కాదయ్యా.. కాంగ్రెస్‌కు ఓటేస్తే..!

## కేసీఆర్ హ్యాట్రిక్ కోసం అజ్మీర్‌లో ప్రార్థనలు

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ సీఎంగా హ్యాట్రిక్ సాధించాలని ఖాదీమ్ పీర్ సయ్యద్ సుల్తాన్-ఉల్-హసన్ మిస్బాహీ నేతృత్వంలో గురువారం అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పించారు. అజ్మీర్ దర్గా కమిటీ కార్యాలయం నుంచి చాదర్‌ను ఖవ్వాలితో ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. రాష్ట్రానికి చేరుకున్న అనంతరం మొయినుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రార్థించినట్టు చెప్పారు. కేసీఆర్ అజేయయాత్ర చేయాలని తాము కోరుకున్నామని చెప్పారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించామన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 36.9°c | 16.4°c |
| ఆదిలాబాద్ | 36.8°c | 18.9°c |
| నల్లగొండ | 36.3°c | 22.4°c |
| మెదక్ | 35.0°c | 18.3°c |
| నిజామాబాద్ | 34.9 °c | 22.5°c |
| ఖమ్మం | 34.0°c | 23.0°c |
| మహబూబ్‌నగర్ | 33.1°c | 23.2°c |
| హైదరాబాద్ | 33.1°c | 20.3°c |
| కరీంనగర్ | 33.0°c | 23.0°c |
| వరంగల్ | 33.0°c | 22.0°c |

# రగులుతున్న కన్నడ రైతాంగం

- 7 గంటల కరెంటు కోసం ధర్నాలు
- 3 గంటలకు మించి ఇవ్వలేమన్న ఈఈ
- రాయ్‌చూర్‌లో పురుగుమందు తాగిన రైతు
- చిత్రదుర్గలో తలపై సద్ది మూటలతో నిరసన

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ రైతులు 24 గంటలూ నిరంతరాయంగా ఉచిత విద్యుత్తు పొం దుతుంటే.. పొరుగున ఉన్న కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో మాత్రం 7 గంటల విద్యుత్తు కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఎండిన వరి మొక్కలను ప్రదర్శిస్తూ విద్యుత్తు కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తున్నారు. గురువారం చిత్రదుర్గ, రాయ్‌చూర్, మైసూర్ తదితర ప్రాంతాల్లోని విద్యుత్తు కార్యాలయాలు రైతుల ఆందోళనలతో దద్దరిల్లాయి. కర్ణాటక స్టేట్ ఫార్మర్స్ అసోసియేషన్, గ్రీన్ సేనా వర్కర్స్ ఆధ్వర్యంలో విద్యుత్తు పంపిణీ కార్యాలయాల ఎదుట ధ ర్నా నిర్వహించిన రైతులు, రోడ్డుపై బైఠాయించి రాకపోకలను స్తంభింపజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బాపూరు తిమ్మప్ప అనే రైతు పురుగుమందు తాగడంతో ఆయనను దవాఖానకు తరలించారు. ఎమ్మెల్యే శివరాజ్‌పాటిల్ రైతుల ఆందోళనకు మద్దతు తెలిపారు. విద్యుత్తు సరఫరా సరిగా లేకపోవడంవల్ల పంటలు ఎండిపోతున్నాయని పేర్కొంటూ, ఎండిపోయిన వరి మొక్కలను ప్రదర్శించారు. విద్యుత్తు శాఖ ఈఈ ఆందోళనకారులతో మాట్లాడుతూ.. నిరంతరం విద్యుత్తు సరఫరా చేసే అవకాశం లేదని, తాము 3 గంటలకన్నా ఎక్కువ కరెంటు ఇవ్వలేమని స్పష్టంచేశారు. దీంతో ఆందోళనకారులు మరింత ఆగ్రహానికి గురై రోడ్డుపై బైఠాయించారు.

ఏడు గంటల నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కర్ణాటకలోని యాద్గిర్ జిల్లాలో జెస్కామ్ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

### సద్ది మూటలతో నిరసన

చిత్రదుర్గలో రైతులు తలపై సద్ది మూటలు పెట్టుకొని విద్యుత్తు పంపిణీ కార్యాలయం ముందు వినూత్న నిరసన తెలిపారు. రైతు దేశానికి అన్నం పెట్టాలంటే కరెంటు ఇవ్వాల్సిందేనని నినదించారు. రైతు సంఘం నాయకులు బసవారెడ్డి మాట్లాడుతూ.. ఏడు గంటల విద్యుత్తు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం దానిని విస్మరించి రైతులను ముంచిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. మైసూరులో విద్యుత్తు పంపిణీ కార్యాలయం ముందు రైతులు టెంటు వేసుకొని రిలే ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఎన్నికల హామీ ప్రకారం ఏడు గంటల నిరంతర నాణ్యమైన విద్యుత్తు ఇచ్చేవరకు తాము ఆందోళనలు విరమించేదిలేదని హెచ్చరించారు. కాంగ్రెస్ తమను నట్టేట ముంచిందని, పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

### బీహెచ్ఈఎల్‌లో..

**బెంగళూరులోని భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ బీహెచ్ఈఎల్‌లో తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 11
- పోస్టులు: ప్రాజెక్టు ఇంజినీర్, ప్రాజెక్ట్ సూపర్‌వైజర్స్
- అర్హతలు, ఎంపిక తదితర వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 7
- వెబ్‌సైట్: https://www.bhel.com

### కరెన్సీ నోట్ ప్రెస్‌లో..

**నాసిక్‌లోని కరెన్సీ నోట్ ప్రెస్‌లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- ఖాళీలు: 117
- పోస్టులు: సూపర్‌వైజర్, ఆర్టిస్ట్, సెక్రటేరియల్ అసిస్టెంట్, జూనియర్ టెక్నీషియన్
- అర్హత: సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 18
- వెబ్‌సైట్: https://www.spmcil.com

### ఎగ్జిమ్ బ్యాంక్‌లో

**ముంబైలోని ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- ఖాళీలు: 45
- పోస్టులు: మేనేజ్‌మెంట్ ట్రైనీ
- అర్హతలు, ఎంపిక తదితర వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 10
- వెబ్‌సైట్: https://www.eximbankindia.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- బయాలజీ, జనరల్ స్టడీస్, జాగ్రఫీ మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

## మామిళ్ల రాజేందర్ వీఆర్ఎస్‌కు ఆమోదం

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): టీఎన్జీవో అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ వీఆర్ఎస్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ గడల శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగం నుంచి శుక్రవారం రిలీవ్ కానున్నారు. వీఆర్ఎస్ కోసం రాజేందర్ ఈ ఏడాది జూలైలో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. వ్యక్తిగత కారణాల వల్ల ఉద్యోగంలో కొనసాగలేనని పేర్కొన్నారు. 20 ఏండ్ల సర్వీస్ పూర్తయిందని, వీఆర్ఎస్‌కు అనుమతించాలని కోరుతూ ఆయన చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

### టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికపై సిటీ సివిల్ కోర్ట్ స్టే

మామిళ్ల రాజేందర్ వీఆర్ఎస్ నేపథ్యంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకొనేందుకు గురువారం టీఎన్జీవో కేంద్ర కార్యవర్గం సమావేశమైంది. అయితే, ఈ ఎన్నికపై సిటీ సివిల్ కోర్టు స్టే విధించింది. దీంతో ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న మారం జగదీశ్వర్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకొనే అవకాశం ఉన్నది. ఈ నెల 30న కొత్త అధ్యక్షుడిని ప్రకటించనున్నట్టు సమాచారం.

# కేంద్రం ఆదేశాలు చెల్లవు

- ఏపీకి విద్యుత్తు బకాయిల చెల్లింపుపై హైకోర్టు తీర్పు
- తెలంగాణకు కేంద్రం ఇచ్చినవి అనాలోచిత ఉత్తర్వులు
- కేంద్రం నిర్ణయం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం
- మధ్యవర్తిత్వమే మార్గంగా వివాదాన్ని పరిష్కరించుకోవాలి
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర హైకోర్టు సూచన

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యుత్తు సంస్థల మధ్య చాలా కాలంగా నలుగుతున్న బకాయిల చెల్లింపు వివాదంపై రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు ప్రకటించింది. ఏకపక్షంగా బకాయిలు చెల్లించాలంటూ కేంద్రం హుకుం జారీచేయడాన్ని తప్పుపడుతూ.. కేంద్రం జారీచేసిన ఆదేశాలను కొట్టివేసింది. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఆగస్టు 29న తెలంగాణకు ఇచ్చిన నోటీసులు చెల్లుబాటు కావని తేల్చి చెప్పింది. తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను ఆమోదించింది. కేంద్రం, ఏపీ ప్రభుత్వాలు చేసిన వాదనను తోసిపుచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాలు మధ్యవర్తిత్వం ద్వారా సదరు వివాదాన్ని పరిష్కరించుకోవాలని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ నోటీసులను సవాల్ చేస్తూ తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు రెండు వారాల క్రితం వాదనలు ముగించి తీర్పును వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం 65 పేజీల కీలక తీర్పును వెలువరించింది. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు చట్టప్రకారం అందుబాటులో ఉన్న పరిష్కారాన్ని కోరే స్వేచ్ఛ ఉన్నదని స్పష్టం చేసింది. ఆ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు, రెండు రాష్ట్రాల విద్యుత్తు సంస్థలు సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపింది. లేనిపక్షంలో మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను సామరస్యపూర్వకంగా కొలిక్కి తెచ్చుకోవాలని సూచించింది.

### కేంద్రం ఏకపక్ష నోటీసులు

నెల రోజుల్లోగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యుత్తు బకాయిల అసలు రూ.3,441.78 కోట్లు, వడ్డీ, సర్‌చార్జీలు కలిపి మరో రూ.3,315.14 కోట్లు కలిపి మొత్తం రూ.6,756.92 కోట్లను చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర పునర్విభజన చట్టం-2014లోని సెక్షన్ 92 ప్రకారం సివిల్ వ్యవహారాలకు సంబంధించిన వివాదాలలో ఏకపక్షంగా వ్యవహరించకుండా తగిన అవకాశాన్ని ఇరు పక్షాలకు ఇవ్వాలి. కానీ తెలంగాణ డిస్కంలకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా, వారి వాదనలు వినకుండా ఏకపక్షంగా ఆదేశాలు జారీచేయడం సరైంది కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. సహజ న్యాయ సూత్రాలను పాటించలేనట్టు స్పష్టమవుతున్నదని, అందుకే ఆంధ్రప్రదేశ్ చేసిన విజ్ఞప్తిని అంగీకరించడం లేదని రాష్ట్ర హైకోర్టు స్పష్టం చేసింది.

### మొదటి నుంచి ఏపీ తొండి..

విద్యుత్తు బకాయిల విషయంలో ఏపీ ప్రభుత్వం మొదటి నుంచి తొండిగా వ్యవహరిస్తున్నది. తమకు బకాయిలు చెల్లించాలంటూ 2019లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పటి నుంచి గగ్గోలు పెడుతున్నది.



అయితే తెలంగాణకు చెల్లించాల్సిన బకాయిలను మాత్రం బయటకు చెప్పడం లేదు. తరువాత ఏపీలో వచ్చిన ప్రభుత్వంకూడా అదే తరహాలో వ్యవహరిస్తూ.. ఏపీ విద్యుత్తు సంస్థలను ఎగదోసింది. అదే సమయంలో విద్యుత్తు సంస్థలు మాత్రం.. కూర్చుని మాట్లాడుకుందామని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందామని ప్రతిపాదించింది. తెలంగాణ ప్రభుత్వం కూడా కేంద్రంలోని హోంశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో పలుదఫాలుగా జరిగిన రాష్ట్ర విభజన సమస్యల పరిష్కార సమావేశాల్లో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. అయితే అటు ఏపీ ప్రభుత్వంకానీ, ఏపీ విద్యుత్తు సంస్థలుకానీ ఇందుకు ముందుకు రాకుండా.. కేంద్రానికి ఫిర్యాదు చేశాయి. అయితే కేంద్రంకూడా అదే ధోరణితో తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్తు సంస్థలకు అవకాశం ఇవ్వకుండా.. అభిప్రాయాన్ని తెలుసుకోకుండా.. ఏపక్షంగా నిర్ణయం తీసుకుని.. తక్షణం ఏపీ బకాయిలు చెల్లించాలంటూ ఆదేశాలు జారీచేసింది. దీనిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమయ్యింది. ఇటు తెలంగాణ ప్రభుత్వం, అటు విద్యుత్తు సంస్థలు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాయి. దీనిపై కేంద్రానికి నోటీసులు పంపించిన కోర్టు.. విచారణ పూర్తి చేసి తీర్పు చెప్పింది.

### ఏపీయే తెలంగాణకు బకాయి

నిజానికి ఏపీ విద్యుత్తు సంస్థలకు చెల్లించాల్సిన మొత్తాన్ని మినహాయిస్తే.. ఏపీయే తెలంగాణకు రూ.12,941 కోట్లు (31.12.2021 నాటికి) చెల్లించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన గణాంకాలను తెలంగాణ విద్యుత్తు సంస్థలు గతంలోనే వెల్లడించాయి. ఏపీ విద్యుత్తు సంస్థల నుంచి తెలంగాణకు రావాల్సిన బకాయిల (31.12.2021 నాటికి) మొత్తం రూ. 17,828 కోట్లు. ఏపీ విద్యుత్తు సంస్థలకు తెలంగాణ విద్యుత్తు సంస్థల నుంచి చెల్లించాల్సిన బకాయిల మొత్తం రూ. 4,887 కోట్లు. ఈ లెక్కన తెలంగాణ విద్యుత్తు సంస్థలకు ఏపీ విద్యుత్తు సంస్థలే రూ. 12,941 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్టు స్పష్టమవుతున్నది. ఇదే విషయంపై సామరస్యంగా చర్చించుకుని పరిష్కారం చేసుకుందామని ప్రతిపాదించినా.. ఏపీ, అక్కడి విద్యుత్తు సంస్థలు వినలేదు. ఇప్పుడు రాష్ట్ర హైకోర్టు తీర్పు నేపథ్యంలోనైనా బకాయిల వివాదాన్ని సామరస్యంగా పరిష్కారం చేసుకునే దిశగా మధ్యవర్తిత్వమే మార్గంగా సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉన్నది.